క్లుప్తంగా

చంద్రశేఖరస్వామికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో స్వామివారు

రంగంపేట: చంద్రేడులో కొలువైయున్న కాత్యాయనీ సమేత చంద్రశేఖర స్వామికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు మైలవరపు కృష్ణ శర్మ ఆధ్వర్యంలో జరిగిన పూజా కార్యక్రమాలకు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

ఘనంగా ఉమామల్లేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ


ఉమామల్లేశ్వరస్వామికి పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు దంపతులు

గోకవరం: మల్లవరం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఉమామల్లేశ్వరస్వామి (శివాలయం)లో సోమవారం విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఉదయం ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. అనంతరం ఉమామల్లేశ్వరస్వామి, గణపతి, నందీశ్వరుడు, నగగ్రహాలు, వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి విగ్రహాలు, ధ్వజస్తంభం ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు, నాగసూర్యవేణి దంపతులు, మాజీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూలు పాల్గొన్నారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నదానం నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నిరుపేదలకు ఆర్థిక సాయం


నగదు పంపిణీ చేస్తున్న సర్పంచ్ చంద్రలీల, రామకృష్ణ దంపతులు

సీతానగరం: మండలంలోని రఘుదేవపురం సర్పంచ్ ఇందుగమిల్లి చంద్రలీల, రామకృష్ణ దంపతులు నిరుపేదలకు ఆర్థిక సహాయం అందించారు. సోమవారం గ్రామంలోని వీకేవీ హెల్పింగ్ హ్యాండ్ ద్వారా ఇందుగుమిల్లి తాతయ్య, ఇందుగుమిల్లి వీరమ్మ జ్ఞాపకార్థం సోమవారం 25 మంది పేదలకు రూ.300 చొప్పున పంపిణీ చేశారు. 2021 జనవరి నుంచి ప్రతినెలా పంపిణీ చేస్తున్నారు. కార్యక్రమంలో పాస్టర్ కొడమంచిలి ప్రకాష్‌బాబు, కె.జాన్ బాబూరావు, జోసఫ్, వైఆర్ జాషువా, ఎంఎస్ కరుణాకర్, కొల్లి రాజేష్ కుమార్ పాల్గొన్నారు.

బాధితులకు ఆసరా


ఆర్థిక సాయం అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

సీతానగరం: మండలంలోని చినకొండేపూడిలో కొల్లి రాజు ఇటీవల ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ నేపథ్యంలో ఆ కుటుంబ సభ్యులకు కొల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందించారు. రాజుకు భార్య, ఏడాది వయసున్న కుమారుడు ఉన్నారు. ఫౌండేషన్ సభ్యులు చేతుల మీదుగా బాధిత కుటుంబానికి రూ.10 వేలు అందించారు. కొల్లి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు


చిత్రలేఖనం పోటీలో పాల్గొన్న విద్యార్థులు

రాజానగరం: జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు నిర్వహిస్తున్న వేసవి శిక్షణా తరగతులలో భాగంగా సోమవారం చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. 15 రోజులుగా జరుగుతున్న ఈ శిక్షణ తరగతులలో విద్యార్థులకు కథలు చెప్పడం, కథలు చదివించడం, నీతి పద్యాలు నేర్పడం, చెప్పించడం, తెలుగు పదాలు నేర్పడం, పేపరుతో క్రాఫ్ట్స్ (బొమ్మలు, ఇతర వస్తువులు) తయారు చేయించడం, చిన్నపిల్లలకు తెలుగు అక్షరాలు నేర్పించడం వంటి అనేక కృత్యాలను చేయిస్తున్నారు. రిసోర్సుపర్సన్స్‌గా పి.భారతి, బి.నాగలక్ష్మి వ్యవహరిస్తున్న ఈ శిక్షణ తరగతులు ప్రతిరోజు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకూ జరుగుతున్నాయి. లైబ్రేరియన్ కె.సత్యనారాయణ పాల్గొన్నారు.

సంక్షేమ రథ సారథులకు పురస్కారాలు

- ఉత్తమ వలంటీర్లకు సత్కారం
- నియోజకవర్గంలో 1,533 మంది వలంటీర్ల ఎంపిక

మండలం	సేవా వజ్ర	సేవా రత్న	సేవా మిత్ర
పెదపూడి	2	5	338
రంగంపేట	2	5	355
బిక్కవోలు	1	5	404
అనపర్తి	–	5	415

అనపర్తి: ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరువ చేయడం ద్వారా మహాత్ముడి కలలను సాకారం చేసే దిశగా రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ వ్యవస్థకు శ్రీకారం చుట్టారు. ముఖ్యమంత్రి ఆశయాలను అనుగుణంగా ప్రజాసేవే పరమావధిగా వలంటీర్లు ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులకు ఇంటికే అందిస్తూ సైనికుల్లా సమర్థవంతంగా పనిచేస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు. తొలినాళ్లలో వలంటీర్ వ్యవస్థను ఎద్దేవా చేసిన ప్రతిపక్షాలకు వలంటీర్లు తమ పనితీరు ద్వారా సరైన సమాధానం చెబుతూ మేము వలంటీర్లు కాదు... వారియర్స్ అని నిరూపిస్తున్నారు.

వలంటీర్లకు పురస్కారాలు

కుల, మత, పార్టీలను చూడకుండా అర్హతే ప్రామాణికంగా నవరత్న పథకాలను ప్రజలకు చేరవేయడంలో వలంటీర్లు ముఖ్యపాత్ర పోషిస్తున్నారు. ప్రతి నెలా వేకువజామునే తలుపుతట్టి మరీ అవ్వా తాతలకు పింఛను సొమ్ములను అందిస్తూ సంక్షేమ రథ సారథుల్లా సేవలందిస్తున్నారు. కోవిడ్ సమయంలో సైతం అహర్నిశలు పనిచేసి నిస్వార్థ, నిరుపమాన సేవలందిస్తున్న సేవా సైన్యానికి ప్రతిఒక్కరూ సలాం అంటున్నారు. సంక్షేమ ఫలాలను అర్హులందరికీ అందిస్తున్న వలంటీర్ల సేవలను గుర్తించిన ప్రభుత్వం వలంటీర్ల పనితీరు ఆధారంగా వారికి నగదు ప్రోత్సాహకాలు, పురస్కారాలు అందజేస్తోంది.

స్వచ్ఛందంగా ప్రజాసేవలో అమూల్యమైన సేవలందిస్తున్న వలంటీర్లను ప్రభుత్వం మూడు కేటగిరీల్లో ఎంపిక చేసి పురస్కారాలు అందజేస్తోంది. సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర ఇలా మూడు కేటగిరీల్లో ఎంపిక చేసి వారికి రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు చొప్పున నగదు బహుమతులు, ప్రశంసాపత్రం, బ్యాడ్జి అందజేసి శాలువాతో సత్కరిస్తోంది.


అనపర్తి గ్రామ పరిధిలో సేవా రత్న, సేవా మిత్ర పురస్కారాలు అందుకున్న వలంటీర్లు

అనపర్తి నియోజకవర్గంలో....

మూడో ఏడాది అనపర్తి నియోజవకర్గంలోని అనపర్తి, బిక్కవోలు, రంగంపేట, పెదపూడి మండలాల పరిధిలో మొత్తం 1,533 మంది వలంటీర్లు పురస్కారాలకు ఎంపికయ్యారు. వీరిలో ఆరుగురు సేవా వజ్ర, 15 మంది సేవా రత్న, 1,512 మంది సేవా మిత్ర పురస్కారానికి ఎంపికయ్యారు. తాము అందిస్తున్న సేవలను గుర్తించి ప్రభుత్వం వరుసగా మూడో ఏడాది పురస్కారాలను ప్రకటించడంపై వలంటీర్లు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

నిస్వార్థ సేవలకు గుర్తింపు



ప్రభుత్వ సేవలన్నీ ప్రజల గడప వద్దకే చేరవేస్తూ వలంటీర్లుగా నిస్వార్థ సేవలు అందిస్తున్నాం. మా సేవలను గుర్తించిన ప్రభుత్వం సేవా పురస్కారాలు అందించడం చాలా సంతోషంగా ఉంది. నేను సేవా రత్నకు ఎంపికయ్యాను. రెంట్టింపు ఉత్సాహంతో సీఎం జగనన్న ఆశయాలను నెరవేర్చే లక్ష్యంగా పనిచేస్తాను.

– వై.సునీత, సచివాలయం–5, అనపర్తి

ఆత్మ సంతృప్తినిస్తోంది



పేదల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న పథకాలు అర్హులైనవారికి అందించేలా నా వంతు కృషి చేస్తున్నాను. ప్రజలకు సేవలందించడం నాకు ఆత్మ సంతృప్తినిస్తోంది. మా సేవలను ప్రభుత్వం గుర్తించి ప్రోత్సాహకాలు అందించి సత్కరించడం ఆనందంగా ఉంది.

– ఎంపీ రమేష్, గ్రామ సచివాలయం–2, అనపర్తి

దొంతమూరులో వలంటీర్లకు వందనం


దొంతమూరులో పురస్కారాలు పొందిన వలంటీర్లతో స్థానిక నేతలు

రంగంపేట: మండలంలోని దొంతమూరులో వలంటీర్లకు వందనం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ గోలి రమణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు చేతుల మీదుగా వలంటీర్లకు సేవా పురస్కారాలు అందజేశారు. అనంతరం జెడ్పీటీసీ రాంబాబు మాట్లాడుతూ వలంటీర్లు చిత్తశుద్ధి, నిబద్ధతతో పని చేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి రిమ్మలపూడి వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు గోలి వెంకటకృష్ణ, పార్టీ గ్రామ కన్వీనర్ చెక్కపల్లి నాగేశ్వరరావు, పంచాయితీ కార్యదర్శి బి.గౌరీశాంతి తదితరులు పాల్గొన్నారు.

యాగశాల ఏర్పాటుకు రాట ముహూర్తం


యాగశాల ఏర్పాటుకు రాట ముహూర్తం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి దంపతులు

అనపర్తి: స్థానిక పాతవూరులో పునఃనిర్మించిన శ్రీదేవి, భూదేవి సమేత జనార్దన స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనను పురస్కరించుకుని యాగశాల ఏర్పాటుకు ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు ఆలయ ప్రాంగణంలో సోమవారం రాట ముహూర్తం నిర్వహించారు. ఆలయ జీర్ణోద్ధరణ, మహా సంప్రోక్షణకు సంబంధించిన ఆహ్వాన పత్రికను ఎమ్మెల్యే దంపతులు ఆవిష్కరించారు. జూన్ 4 నుంచి 8వ తేదీ వరకు ప్రతిష్ఠాపన పూజలు జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు చెప్పారు. జూన్ 4న సంకల్ప దీక్ష, విష్వక్సేన పూజ, స్వామి, అమ్మవార్ల గ్రామోత్సవం, 5న అగ్నిప్రణయనం, 6న క్షీరాధివాసం, 7న జలాధివాసం, శయనాధివాసం, 8వ తేదీన యంత్ర స్థాపన, శ్రీదేవి, భూదేవి సహిత జనార్దనస్వామి విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ అంనూరి సూర్యనారాయణ, సర్పంచ్ వారా కుమారి, ఆలయ కమిటీ ప్రతినిధులు నల్లమిల్లి సీతారామారెడ్డి, నల్లమిల్లి మునీశ్వరరెడ్డి, కర్రి రామన్నతాత, పడాల చంద్రకళ, కొండేటి భీమేష్, పాలి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు ప్రజలే బుద్ధి చెబుతారు

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- చంద్రబాబు అనుచిత వ్యాఖ్యలపై మండిపడిన లబ్ధిదారులు
- దిష్టిబొమ్మతో శవయాత్ర చేసి నిరసన


చంద్రబాబు దిష్టిబొమ్మకు అంతిమ సంస్కారాలు చేస్తున్న పార్టీ శ్రేణులు, జగనన్న కాలనీవాసులు

అనపర్తి: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్న పథకాలతో రాష్ట్రంలో పేద ప్రజలకు జరుగుతున్న మేలును ఓర్చుకోలేని టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు చేసిన అనుచిత వ్యాఖ్యలను ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఖండించారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు మంజూరు చేస్తున్న ఇంటి స్థలాలు సమాధులు కట్టుకోవడానికి కూడా పనికిరావంటూ చంద్రబాబు చేసిన వ్యాఖ్యలపై మండిపడ్డ లబ్ధిదారులు సోమవారం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులతో కలిసి అనపర్తి శివారు కొత్తూరు జగనన్న కాలనీలో నిరసన ర్యాలీ చేపట్టారు. ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని అన్నారు. టీడీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లలో పేదలకు సెంటు స్థలం కూడా ఇవ్వలేదని విమర్శించారు. కేవలం పెత్తందారుల భవిష్యత్తు కోసం నిరంతరం ఆలోచించే చంద్రబాబుకు పేదలంటే చులకనన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన ప్రజల మనోభావాలు దెబ్బతినేలా చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు ఆయన దురహంకారానికి నిదర్శనమన్నారు. రాబోయే ఎన్నికల్లో పేదలే ఆయనకు రాజకీయ సమాధి కట్టబోతున్నారని చెప్పారు. పేదలందరికీ చంద్రబాబు క్షమాపణ చెప్పాలంటూ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు డౌన్‌డౌన్ అంటూ లబ్ధిదారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు నినదిస్తూ చంద్రబాబు దిష్టిబొమ్మతో శవయాత్ర నిర్వహించి ఖననం చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి, పార్టీ రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి చిర్ల వీర్రాఘవరెడ్డి, సర్పంచ్ వారా కుమారి, పార్టీ గ్రామ కమిటీ కన్వీనర్ నల్లమిల్లి మురళీ మోహన బాలకృష్ణారెడ్డి, వార్డు సభ్యుడు సుమన్, పార్టీ నాయకులు సత్తి గంగిరెడ్డి, పాదూరి దేవిడ్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

సకల సౌకర్యాలతో జగనన్న కాలనీలు

జగనన్న కాలనీల్లో సకల సౌకర్యాల కల్పనకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. సోమవారం అనపర్తి శివారు కొత్తూరు జగనన్న కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన వీధి దీపాలను ఎమ్మెల్యే ప్రారంభించారు.

కోరుకొండ హైస్కూల్లో అటల్ సమ్మర్ క్యాంప్


కోరుకొండ హైస్కూల్లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

మధురపూడి: విద్యార్థుల్లో శాస్త్ర, సాంకేతిక నైపుణ్యతను పెంపొందించడానికి అటల్ టింకరింగ్ లాబ్ సమ్మర్ బూట్ క్యాంపులు ఉపయోగపడతాయని ఎంఈఓ కుశలవ దొర అన్నారు. కోరుకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం అటల్ క్యాంప్‌ను ఆయన ప్రారంభించారు. తొలుత ఏపీజే అబ్దుల్ కలామ్, సీవీ రామన్ చిత్ర పటాలకు పుష్పాంజలి ఘటించారు. ఎంఈవో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో వీటిని నిర్వహిస్తోందన్నారు. 6 నుంచి 9వ తరగతి వరకూ ఎంపిక చేసిన 25 మంది విద్యార్థులకు ఈనెల 25వ తేదీ వరకూ శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 8.30 నుంచి సాయంత్రం 4.30 వరకూ తరగతులు జరుగుతాయన్నారు. స్కూల్ హెచ్‌ఎం రామన్నదొర అధ్యక్షన జరిగిన ఈ కార్యక్రమం జరిగింది. ఢిల్లీకి చెందిన అటల్ ఇన్నోవేషన్ మిషన్, పూణె విజ్ఞానాశ్రమానికి చెందిన స్పెషలిస్టులు శిక్షణ ఇచ్చారు.

పర్యావరణంపై అవగాహనకు మిషన్ లైఫ్


గుమ్ములూరులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

మధురపూడి: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, దానిపై ప్రజలకు అవగాహన కల్పించడానికి అటవీశాఖ మిషన్ లైఫ్ కార్యక్రమం నిర్వహిస్తోందని అటవీశాఖ దివాన్ చెరువు సెక్షన్ డిప్యూటీ రేంజ్ అధికారి పద్మావతీ దేవి అన్నారు. కోరుకొండ మండలం బూరుగుపూడి, గుమ్ములూరు గ్రామాల్లో సోమవారం అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు, ప్రతిజ్ఞ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఈనెల 12న ప్రారంభమైన ఈ కార్యక్రమం జూన్ 5వ తేదీ వరకూ జరుగుతుందన్నారు. దివాన్ చెరువు సెక్షన్ పరిధిలోని రాజానగరం, కోరుకొండ, సీతానగరం, రంగంపేట మండలాల్లో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్లాస్టిక్ నిషేధంతో పర్యావరణానికి మేలు జరుగుతుందన్నారు. ఇంధనాన్ని పొదుపుగా వాడాలని, నీటిని సంరక్షించుకోవాలన్నారు. ఈ సందర్భంగా మొక్కలను నాటారు. సచివాలయాల వద్ద ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో అటవీశాఖ బీట్ ఆఫీసర్ జీవీ రంగారావు, అసిస్టెంట్ ఆఫీసర్ శివప్రసాద్, బూరుగుపూడి సచివాలయం సెక్రటరీ తాతపూడి జాకబ్‌రాజు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలల్లో సమస్యల పరిష్కారానికి కృషి


నన్నయ వీసీ ఆచార్య పద్మరాజును సన్మానిస్తున్న డిగ్రీ కళాశాలల యాజమాన్య ప్రతినిధులు

రాజానగరం: డిగ్రీ కళాశాలల్లో నెలకొన్న వివిధ సమస్యలను పరిష్కరించే దిశగా ప్రయత్నం చేస్తానని ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య కొప్పిరెడ్డి పద్మరాజు అన్నారు. అనుబంధంగా ఉన్న డిగ్రీ కళాశాలల యాజమాన్య ప్రతినిధుల అసోసియేషన్, పీజీ కళాశాలల ప్రిన్సిపాళ్ల సంయుక్త సమావేశం యూనివర్సిటీ క్యాంపస్‌లో సోమవారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వీసీ.. ఆయా కళాశాలల ప్రతినిధులు, ప్రిన్సిపాళ్లు వ్యక్తపరిచిన అభిప్రాయాలను, సమస్యలను సానుకూలంగా విన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బైపీసీ చదివిన విద్యార్థులకు కూడా బీసీఏలో ప్రవేశం కల్పిస్తామన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి సర్టిఫికెట్లు సత్వరమే మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. పరీక్షాపత్రాలకు చెల్లించే రుసుము విషయమై నెలకొన్న సమస్యను కూడా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య పద్మరాజును అసోసియేషన్ సభ్యులు ఘనంగా సన్మానించారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, డీన్ ఆచార్య కేఎస్ రమేష్, అసోసియేషన్ అధ్యక్షుడు కేఎల్ నరసింహరావు, ఉపాధ్యక్షుడు నారాయణరావు, హబీబుల్లా, సుగుణారెడ్డి, శివకుమార్ పాల్గొన్నారు.

ముగిసిన సీబీసీ ఉత్సవాలు

మధురపూడి: కోరుకొండ మండలం బూరుగుపూడి లూథరన్ చర్చిలో చిల్డ్రన్ బైబిల్ క్లబ్ (సీబీసీ) ఉత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా చిన్నారులకు బైబిల్‌పై అవగాహన పెరిగేలా వివిధ ప్రదర్శనలు నిర్వహించారు. ఏసుక్రీస్తు బోధనలు, బైబిల్‌లోని ఘట్టాలను కళ్లకు కట్టినట్టు ప్రదర్శించారు. ఐదు రోజులుగా ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. పాస్టర్ జె.ఇశ్రాయేలు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఏఈఎల్‌సీ సంస్థ డెలిగేట్ కొవ్వాడ రాజు, చర్చి కమిటీ సభ్యులు దున్నా రాజు, భాస్కర్, కృష్ణంరాజు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు

ఆరుగురికి గాయాలు


హైవేపై బోల్తా పడిన కారు

రావులపాలెం: గోపాలపురం సెంటర్ జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరుగురికి గాయాలు అయ్యాయి. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. తణుకు వైపు నుంచి వస్తున్న కారు స్థానిక గోపాలపురం జంక్షన్ వద్ద బైక్‌పై రోడ్డు దాటుతున్న పొడగట్లపల్లికి చెందిన జె.దుర్గాప్రసాద్‌ను ఢీకొంది. వెంటనే పక్కనున్న డివైడర్‌ను ఢీకొట్టడంతో కారు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో దుర్గాప్రసాద్‌తో పాటు కారు ప్రయాణిస్తున్న రంగంపేటకు చెందిన బి.సూర్యకుమారి, రాజు, కె.మంగా, శ్రీనివాసరావు, డ్రైవర్ ఎ.సత్యనారాయణకు గాయాలయ్యాయి. క్షతగ్రాతులను కొత్తపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై వెంకటరమణ తెలిపారు.

జాతీయ బీసీ సంఘం మహిళా అధ్యక్షురాలిగా డాక్టర్ పద్మలత


డాక్టర్ పద్మలతకు నియామక పత్రం అందజేస్తున్న కృష్ణయ్య

రాజమహేంద్రవరం సిటీ: జాతీయ బీసీ సంక్షేమ సంఘం మహిళా అధ్యక్షురాలిగా నగరానికి వైఎస్సార్ సీపీ నాయకురాలు, మాజీ కార్పొరేటర్ డాక్టర్ అనుసూరి పద్మలత నియమితులయ్యారు. ఈ మేరకు ఆ సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య సోమవారం నియామక పత్రాన్ని అందజేశారు. హైదరాబాద్‌లోని సంఘం కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. కృష్ణయ్య మాట్లాడుతూ డాక్టర్ అనుసూరి పద్మలత సమాజ సేవా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటున్నారన్నారు. ఢిల్లీ ఉద్యమంలోనూ ఆమె గళం వినిపించాలనే ఉద్దేశంతో జాతీయ స్థాయిలో మహిళా అధ్యక్ష పదవి అప్పగించామన్నారు. పార్లమెంటులో బీసీ బిల్లు, మహిళా బిల్లు ప్రవేశపెట్టి బీసీ మహిళలకు సబ్ కోటా తప్పనిసరిగా కల్పిస్తే బీసీలకు న్యాయం జరుగుతుందన్నారు. డాక్టర్ అనుసూరి పద్మలత మాట్లాడుతూ మహిళలు విద్య, వ్యాపార, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

వలంటీర్లే రాష్ట్రానికి నిజమైన సంక్షేమ సారథులు

పెదపూడి: గ్రామ వలంటీర్లే రాష్ట్రానికి నిజమైన సంక్షేమ సారథులని ఎంపీపీ కేతా తులసి అన్నారు. జి.మామిడాడలో నాలుగు సచివాలయాలు, పైన, రాజుపాలెం గ్రామాల్లో సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర గ్రామ వలంటీర్లను ఘనంగా సోమవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీపీ కేతా తులసి మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాల్ని ప్రతి గడపకూ తీసుకెళ్లి చేరుస్తున్న వలంటీర్లకు ప్రత్యేక అభినందనలు తెలియజేస్తున్నానన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి, ఇన్‌చార్జి ఎంపీడీఓ కర్రి హరికృష్ణ సత్యరెడ్డి, సర్పంచులు లంక మున్ని, గుత్తుల పుష్పవతి, సుందరపల్లి ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

ఊలపల్లిలో వలంటీర్లకు వందనం

బిక్కవోలు: మండల పరిధిలోని ఊలపల్లిలో వలంటీర్లకు వందనం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అనపర్తి నియోజకవర్గ ప్రచార కమిటీ చైర్మన్ రొంగల అప్పాజీ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర పంచాయతీ కార్యదర్శి పోతుల బుజ్జి, ఎంపీటీసీ బండారు శివ హాజరై వలంటీర్లకు పురస్కారాలు అందజేశారు.

వలంటీర్ సంతోష్‌కు సత్కారం


వలంటీర్ సంతోష్‌ను సత్కరిస్తున్న నాయకులు

మధురపూడి: మండల కేంద్రమైన కోరుకొండ సచివాలయంలో సేవారత్న అవార్డు గ్రహీత ఎం.సంతోష్‌ను సోమవారం సత్కరించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ నేతుల చిన్ని మాట్లాడుతూ సంతోష్ సేవలను అభినందించారు. కార్యక్రమంలో కోరుకొండ ఎంపీటీసీ సభ్యుడు గొల్లపల్లి ప్రవీణ్, వైఎస్సార్ సీపీ యువజన విభాగం మండల కన్వీనర్ బొండాడ చందు, సచివాలయం కన్వీనర్ పసుపులేటి బుల్లియ్య నాయుడు పాల్గొన్నారు.

గోగులమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే

పెదపూడి: కైకవోలు గ్రామంలో సోమవారం గోగులమ్మ అమ్మవారి జాతర సందర్భంగా ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు గ్రామ సర్పంచి నూని పట్టాభిరామన్న చౌదరి, ఉప సర్పంచి కొప్పిశెట్టి వీరశంకర్(పండు), దాట్ల సింహాద్రిరాజు, నూని రామచంద్రరావు తదితరులు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు.

నేడు గోకవరంలో 'వలంటీర్లకు వందనం'

గోకవరం: గ్రామంలో వలంటీర్లకు వందనం కార్యక్రమం మంగళవారం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ కేఎస్ఎస్ఎన్ మూర్తి సోమవారం తెలిపారు. స్థానిక ఎస్‌వీఆర్ ఫంక్షన్ హాలులో ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం జరుగుతుందని, ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. సచివాలయాల వలంటీర్లు, సిబ్బంది పాల్గొనాలన్నారు.

26న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

రంగంపేట: రంగంపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఈ నెల 26వ తేదీ శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ బి.శ్రీరామరాజు సోమవారం తెలిపారు. ఎంపీపీ రిమ్మలపూడి శ్రీదేవి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు, జిల్లా పరిషత్ కో–ఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్నతో పాటు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హాజరవుతారన్నారు. మండల స్థాయి అధికారులందరూ సమావేశానికి తప్పనిసరిగా హాజరు కావాలన్నారు.

30 మందికి ఉద్యోగాలు

రాజానగరం: దివాన్ చెరువులోని వీజేస్ ఫార్మసీ కళాశాలలో దివిస్ లేబొరేటరీస్ సోమవారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించింది. మందుల నాణ్యత నియంత్రణ, నాణ్యత హామీ ఉద్యోగాల భర్తీ కోసం చేపట్టిన ఈ రిక్రూట్‌మెంట్‌లో బి.ఫార్మసీ ఫైనలియర్ చదువుతున్న 30 మంది విద్యార్థులు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ డాక్టర్ డి.నరేంద్ర తెలిపారు. ఎంపికైన వారికి ఒక్కొక్కరికీ రూ. 2.6 లక్షలు వార్షిక వేతనంగా ఉంటుందన్నారు.

భూమి సమానంగా పంచాలని వినతి

రంగంపేట: రంగంపేట రెవెన్యూ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మండల స్థాయి స్పందన కార్యక్రమంలో ఒక అర్జీ అందినట్టు తహసీల్దార్ అమ్మాజీ తెలిపారు. దొడ్డిగుంట గ్రామంలో సర్వే నంబరు 175లో తమ తండ్రి మల్లెల చక్రరావుకున్న 0.95 సెంట్లు భూమిని తమ ముగ్గురు అన్నదమ్ములకు సమానంగా పంచాలని చక్రరావు కుమారులు మల్లెల వెంకన్న, మల్లెల గోవిందరాజులు వినతి పత్రం అందించారన్నారు.

అర్జీలు నిల్

మధురపూడి: మండల స్థాయి అధికారుల పరిధిలో సమస్యలకు సకాలంలో పరిష్కారం లభించడంతో స్పందనకు ఫిర్యాదులు అందడం లేదని కోరుకొండ తహసీల్దార్ పాపారావు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనకు ఫిర్యాదులు అందలేదన్నారు.